# గమ్యస్థానం

'శేషయ్యా?

'ప్రభూ!'

'ఏం అలా చూస్తున్నావేం?'

'ఏమీ లేదండి-మీ ధోరణి చూస్తుంటే మళ్లీ ఏదో...'

'భయపడకు శేషయ్యా-వూరికే నే, వూసుపోక పలకరించాను-'

'ధన్యుణ్ణి!'

'అయితే శేషయ్యా-?'

'ప్రభూ!'

'చూడూ—?'

'చూస్తున్నానండి-ధరిస్తున్నానండి'

'మన వూరికి-'

'ఊఁ!'

'మనవూరికి-సిరిపురం ఎంతదూరమోయ్?'

'ఇంతేనాండీ-చంపేశారనుకున్నా-!'

'ఇంతేనోయ్!'

'చిత్తం! ప్రభువులకి సిరిపురం ప్రసక్తి ఎందుకు వచ్చినట్టండీ?'

'అనవసర ప్రసంగం మనకి వొద్దు శేషయ్యా-అడిగినదానికి సమాధానం సూటిగా రావాలి-నే నడిగేది-మనవూరికి సిరిపురం ఎంతదూరమని— తెలిస్తే చెప్పు. లేకపోతే-'

'చిత్తం! సిరిపురం ఇక్కడికి పదహారు మైళ్లలో వుందండి-'

'ఇంతేనా?'

'ఇంతేనండి-వెడదామా?'

'ఎబ్బే! ఎందుకోయ్, వూరికే నే అడిగేను-'

'అలాగనాండి!'

'అయితే చూడు శేషయ్యా-?'

'ప్రభూ !'

'సిరిపురం మనవూరికి పదహారు మైళ్లని కదూ అన్నావు ?'

'అవునండి.'

'రైట్ ! అయితే, సిరిపురానికి మనవూరు ఎన్నిమైళ్లలో వుంటుందో-కొంచం ఆలోచించి చెప్పగలవా ?'

'ప్రభూ ! పదండి-వెడదాం-'

'ఎక్కడికి-సిరిపురమే ?'

'కాదండి-ప్రమాదకరమైన ఆలోచనలు చేసేవారిని దాచేచోటుకి-'

'శేషయ్యా! ఇది వేళాకోళాలికి సమయంకాదు-మన వూరికి సిరిపురం పదహారు మైళ్లయితే, సిరిపురానికి మనవూరు ఎన్నిమైళ్ళని అడుగుతూన్నా-సూటిగా చెప్పు-'

'ప్రభూ! ఇలా ఏడిపించడం భావ్యంకాదు-ఈ వూరికి ఆ వూరెంతో, ఆ వూరికి ఈ వూరుకూడా అంతేనన్న సంగతి మీకు తెలియక పోదనుకుంటా-'

'అయితే సిరిపురానికికూడా మనవూరు పదహారు మైళ్లేనంటావ్ ?'

'నేననేదేమిటండీ-ఇది గొప్ప సత్యంకాదూ ?'

'నిజంగా ?'

'ప్రభూ ! నిజం ! నిజం ! నిలువెల్లా నిజం !'

'శేషయ్యా !'

'హా ! ప్రభూ !'

'ఎంత అపఖ్యాతి !'

'ఏమిటండీ ?'

'సిరిపురానికి మనవూరుకూడా పదహారు మైళ్లే వుండటం-'

'నిజమేనండి-మన ఖర్మం కాలితే ఏంచేస్తాం మరి ?'

'శేషయ్యా ! అది అలా వీల్లేదు. సిరిపురం మనకి పదహారు మైళ్ళు అయితే అయింది. సిరిపురానికి మాత్రం మనం పదహారుమైళ్లకంటే ఎక్కువే వుండాలి-'

'ఇది ఎలా సాధ్యమండి?'

'సాధ్యం కాకపోతే సాధ్యమయ్యేటట్టు చెయ్యాలి-నువ్వే చెప్పావ్, వాళ్లెవళ్లో ప్రయత్నించి ఎవరెస్టు శిఖరాన్ని అందుకో గలిగారని!'

'దానికీ దీనికీ పోలిక లేదు - ప్రభూ!'

'శేషయ్యా! అదంతా నాకొద్దు-ఇరవై నాలుగ్గంటలలోగా-'

'హా! ప్రభూ!'

'ఇదుగో! తక్షణం సిరిపురం వెడుతున్నా-పదహారు మైళ్లేకదూ అన్నావ్?'

'అవునండి!'

'సరే-తక్షణం సిరిపురం-మనవూరికి పదహారు మైళ్లలోవున్న సిరిపురం-వెడుతున్నా-'

'వెళ్ళి?'

'అక్కడకు జేరుకుని మళ్ళీ నేను ఇక్కడకు తిరిగి వచ్చేసరికి ఆ వూరినుండి ఈ వూరికి దూరం ఆ పదహారుమైళ్ళే వుంటే నేను సహించే వాడిని కాను-సాధ్యమైనన్ని మైళ్ళు ఎక్కువ వుండాలి-'

'ప్రభూ! నాకు ఏడుపొస్తూంది'

'ఏమీ లేదు-భయపడకు-మళ్లీ నేను అట్నుంచి ఇటు బయల్దేరేసరికి మనవూరు కొన్ని మైళ్లు వెనక్కి జరిపించు-'

'హా!'

'ఛీ! వెధవభయం!

'ప్రభూ! మాటవరసకి మీరు అట్నుంచి ఇటూ వచ్చేసరికి మనవూరు ఇంకో నాలుగుమైళ్లు వెనక్కే వెడుతుందనుకోండి-'

'అవునూ! ఇంతే! మనక్కావల్సింది'

'ప్రభూ! అంతే అయితే, మళ్లీ మనవూరికి సిరిపురం ఇరవైమైళ్లు కాదండీ?'

'చంపేశావ్! శేషయ్యా! నా ఆశలన్నీ కూలిపోయాయ్! నువ్వు చెప్పింది నిజమెలావుతుంది! హరేరాం!'

'ప్రభూ! ధైర్యం వహించండి!'

'ఇంకేం ధైర్యం శేషయ్యా? అయితే ఇంక ఎప్పటికీ మనవూరికి సిరిపురం ఎంతో సిరిపురానికి మనవూరూ అంతే అవుతూ వుంటుం దంటావ్?'

'అదేనండి- సేన సేది-?

'ఛీ! వెధవ పరిస్థితులూ, వెధవ వూళ్లును:'

'ఇవి ఎప్పుడూ వుండే పరిస్థితు లేనండి-'

'అయినా, సిరిపురానికి బొత్తిగా మర్యాద తెలియదోయ్! మనవూరు సిరిపురానికి దూరంగా వెళ్లి గడించుకుంటానన్న దూరాన్ని మళ్ళీ సిరిపురంకూడా గడించుకుంటుందనేదే నారు తలసిం్కా లెప్పెట్టే విషయం. ఎంత మొండి సిరిపురం!'

చిత్తం! ఇలాంటి పరిస్థితులలో అసలు మనవూరు సిరిపురానికి దూరంగా పోతాననడమే తప్పండి-'

'తప్పేనంటావా-మనవూరిదే ఆ తప్పు?'

'ఔనండి!'

శేషయ్యా! మనవూరు సిరిపురం రెండూకూడా వెధవ్వూళ్లే-పద-పట్నంపోయి కొన్నెమారా హోటల్లో బ్రతుకుదాం-'

## యుద్ధానంతరము...

'శేషయ్యా?'

'ప్రభూ!'

'మనం వుత్త వెధవలమోయ్—'

'చిత్తం-ప్రభువులమాట కాదనగలమా?'

'ప్రపంచమంతటా తలమీద వెంట్రుకలులేని వాళ్లందరూ యుద్ధానంతరపు కబుర్లు చెప్పుకుంటూంటే, మనం—'

'చిత్తం, ఏమనం?'